## అసుర సంధ్యవేళ !




అర ఎకరం ఆవరణలో ఆరంతస్తుల అందమైన భవనం! ఆకాశానికి నిచ్చెన వేస్తున్నట్లుగా 'ఎల్' షేప్‌లో మెట్ల వంకర్లు తిరుగుతూ అరవై అడుగుల ఎత్తుకు దారి చూపుతున్నాయి!

మొదటి అంతస్తు మెట్ల పక్క గదిలో లెక్కల పుస్తకాలు చూస్తూ, మధ్య మధ్య వోర చూపులు విసురుతున్నాడు అక్కౌంటెంట్ సీతాపతి— లోపల గదిలోకి.

ఆ లోపల ఉన్నది జగన్నాథం! ఆయన కుడిచేతి వేళ్ళ కున్న రెండు వజ్రపు ఉంగరాలు పగలు, రేయికి తేడా తెలియకుండా విరజిమ్ముతున్న మెర్క్యురీ లైట్ల కాంతిలో ధగధగలాడిపోతుంటే సీతాపతి కళ్ళు జిగేల్ మన్నాయి!

అయిదు రైస్ మిల్స్‌కు వోనరు జగన్నాథం! రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌కు అధ్యక్షుడు కూడా!

పేదవాడి బతుకులాగే చిల్లుల మయంగా ఉన్న జేబు రుమాలును చింకి కోటు జేబులోనుంచి తీసి, కళ్ళజోడు తుడుచుకున్నాడు సీతాపతి!

ఆ సమయానికి బూట్ల టకటకలు వినిపించాయి! చటుక్కున జోడు కళ్ళకి తగిలించుకున్నాడు సీతాపతి!

నల్లరంగులో నిగనిగ మెరుస్తున్న బూట్లపైన తెల్లని పాలిస్టర్ పాంట్ జీరాడుతుంటే, పైకి సరిచేసుకుంటూ మెట్లదాకా పోయి ఆగిపోయాడు జగన్నాథం.

ఆ సిగ్నల్ అందుకున్న సీతాపతి రివ్వున ఆయన చెంత వాలిపోయాడు గాలికన్న స్పీడుగా.

"సార్! డ్రయివర్ని పిలవమంటారా?"

జగన్నాథం మాట్లాడలేదు! తల పంకించనూ లేదు!

టకటకలాడిస్తూ హాల్లోకి నడిచాడు జగన్నాథం!

నకనకలాడుతూ వెంబడించాడు సీతాపతి!

జగన్నాథం దృష్టి హాలులోని మూలమూలల్ని నిశితంగా పరిశీలిస్తుంటే సీతాపతి ఒళ్ళు తడిసిపోయింది.

జగన్నాథం గిరుక్కున వెనక్కి తిరిగాడు.

"అరగంట క్రితమే హాలంతా క్లీన్ చేయించాము, సార్. సుబ్బయ్య చాలా శ్రమపడ్డాడు పాపం!" అన్నాడు సీతాపతి సహజమైన జాలి కురిపిస్తూ.

"దట్సాల్!"

జగన్నాథం చరచర క్రిందికి దిగిపోతున్నాడు.

క్రింద విశాలమైన ఆవరణ! రకరకాల క్రోటన్స్, రంగురంగుల పూల మొక్కలు ఆయన్ని పలకరిస్తున్నట్లుగా అందంగా నవ్వుతున్నాయి.

"పూలంటే మీకు ప్రాణమని సుబ్బయ్యకు తెలుసు సార్! అందుకే..." అని సీతాపతి ఏదో చెబుతూనే అనుసరిస్తున్నాడు.

జగన్నాథం చూపులు కాంపౌండు గోడ కానుకుని ఉన్న తాటాకుల పాకలో కట్టివేసి ఉన్న రెండు ఆవుల మీదకు ప్రసరించాయి.

ఆవులు నోళ్ళు వెళ్ళబెట్టుకుని ఉన్నాయి, ముందు ఏమీ లేకపోవటాన!

సీతాపతి గుండె జారిపోయింది!

"మనావులు పచ్చగడ్డి ముట్టటం లేదు, సార్! జొన్నగడ్డి బండి వాడింకా తేలేదు" అన్నాడు బెకబెకమంటూ.

"మధ్యాహ్నం జరిగిన పార్టీకి ఎన్ని అరటిగెలలు తెప్పించావ్?" గద్దించాడు జగన్నాథం.

"పదిహేను,సార్" అన్నాడు సీతాపతి.

"మన ఆవులకు అరటి తొక్కలంటే చాలా ప్రీతి అనుకుంటా."

జగన్నాథం మాటలు చెవి కెక్కటమే తరువాయిగా హార్ట్ ఎటాక్ వచ్చినట్లయింది సీతాపతికి! పెదబాబులు పండ్లు ఆరగించగా గుట్టలుగా పేరుకున్న అరటి తొక్కలు అతని మనసులో మెదిలాయి! వాటి ఉనికిని గురించిన ఆలోచనతో బుర్ర వేడెక్కిపోయింది.

జగన్నాథం మరో మాట లేకుండా విసవిస గేటు వైపు పోతున్నాడు.

జవసత్వాలుడిగిపోతున్నా, సీతాపతి పరుగుతీస్తూ ఆయన్ని చేరుకున్నాడు.

"బసవయ్యా!"

సీతాపతి గిలగిల్లాడిపోయాడు జగన్నాథం గర్జనకు.

గేటు పక్కనే ఉన్న గుడిసెలోనుంచి "వస్తున్నా, బాబూ!" అన్న కేక, ఆ వెనకనే ఆ కేక తాలూకు శాల్తీ జగన్నాథం ముందు కొచ్చి తలొంచుకుంది!

"ఏరా, అరటితొక్క లేంజేశావ్"

అన్నాడు జగన్నాథం ఫెళ్ళున ఉరిమినట్లు.

అయ్యగారి రంకెలకు భాష్యం తెలుసుకున్నాడు బసవయ్య.

మరుక్షణం గుడిసెలోకి పరుగెత్తి అరటి తొక్కల గుట్ట తీసుకొచ్చి ఆవు దూడల ముందు పడేశాడు.

ఆవులు తొక్కల్ని ఆవురావురుమంటూ తినేస్తున్నాయి.

జగన్నాథం తృప్తిగా నవ్వుకోబోయాడు.

ఆ సరికి బసవయ్య పెద్ద కొడుకు అరటితొక్క నొకదాన్ని ఆదేపనిగా చీకుతూ గుడిసెలోనుంచి వచ్చా డక్కడికి. ఆ తొక్క కోసమే మారాం చేస్తూ రెండోవాడు వెంటపడ్డాడు.

"బాబుగోరూ ... ఏదో ..." అంటూ బసవయ్య సంజాయిషీ చెప్పుకోవాలని నాలుక మెలికలు తిప్పుతుండగా సీతాపతి అందుకుని — "పా ... పా ... పా ... ర .. పా .." అని వాక్యాన్ని పూర్తి చేయలేక చొల్లు కార్చేశాడు.

అరటి తొక్కల్ని తినటానికి దిగజారిపోయిన బసవయ్య పిల్లల్ని చూసిన జగన్నాథం హృదయం భగ్గున మండిపోయింది!

'వీళ్ళు మనుషులా, గొడ్లా!' అనుకున్నాడు, సీతాపతి వైపు హేయమైన దృక్కుల్ని సారిస్తూ.

నదిలో మునిగి తేలుతున్నట్లుగా ఉంది సీతాపతికి.

జగన్నాథం రక్కున వెనక్కి తిరిగి భవంతివైపు సాగిపోయేడు.

సీతాపతికి కళ్ళనీళ్ళ పర్యంతమైంది!

ఇంట్లో బియ్యం నిండుకోవటాన, రెండే రెండు అరటిపండ్లు కొని తన బిడ్డల ఆకలి తీర్చాడు రాత్రి! తామిద్దరూ పస్తే! బసవయ్య పిల్లల కంటే తన పిల్లల బతుకే కొంత మెరుగన్న మాట!

"సీతాపతీ!"

దూరంగా కొండలు ఢీకొన్న శబ్దం!

జగన్నాథం లిఫ్ట్‌లో ఆరో అంతస్తు బటన్ నొక్కుతూ పిలిచిన విధానం అది!

సీతాపతికి నేలమీద కాళ్ళు నిలవ లేదు. ★